# క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా జరుపుకొంటున్నాం



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



కార్యక్రమానికి హాజరైన క్రైస్తవులు

- చర్చిల నిర్మాణానికి సహకారం అందించా
- సిద్దిపేటలో క్రైస్తవ భవనం నిర్మించుకున్నాం
- క్రైస్తవుల సమాధుల కోసం స్థలం కేటాయించాం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- క్రిస్మస్ కానుకలు పంపిణీ

సిద్దిపేట, డిసెంబర్ 22: ప్రతి ఏడాది క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా జరుపుకొంటున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని కొండ భూదేవి గార్డెన్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ కానుకాలు అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు, రంజాన్‌కు ముస్లింలకు, బతుకమ్మ పండుగకు హిందువులకు కొత్త బట్టలు అందించామన్నారు. అందరూ కొత్త బట్టలతో పండుగ జరుపుకోవాలని ఈ కానులను అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవులందరి మధ్య క్రిస్మస్ కేక్ కట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, శాంతితో, రాగద్వేషాలు లేకుండా ప్రజలందరూ బాగుండాలి ఏసుక్రీస్తు బోధించాడన్నారు. నియోజకవర్గంలో చర్చీల నిర్మాణానికి వ్యక్తిగతంగా సహకారం అందిస్తున్నానని తెలిపారు. చర్చి కట్టుకుంటామని వచ్చిన వారికి సహకరించానన్నారు. సిద్దిపేటలో క్రైస్తవ భవనం చక్కగా నిర్మించుకున్నామని, క్రైస్తవుల కోసం సమాదుల నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, సిద్దిపేట అన్ని రంగాల్లో ముందుండాలని యేసుక్రీస్తును ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రమేశ్, క్రైస్తవ మత పెద్దలు సికిందర్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సాగుతో చిక్కులే..



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి



సమావేశానికి హాజరైన మహిళా రైతులు

- చిరుధాన్యాల సాగుతో ఆహార కొరత రాదు
- సేంద్రియ ఎరువు ఉత్పత్తికి పశువులను పంపిణీ చేయాలి
- వాతావరణాన్ని తట్టుకొనే విత్తనాలు ఉత్పత్తి చేసి రైతులకు అందించాలి
- పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి.. మద్దతు ధర కల్పించాలి
- చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులు

జహీరాబాద్, డిసెంబర్ 22: కార్పొరేట్ సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడంతో సన్న, చిన్నకారు రైతులు సాగు చేసే పంటలు కనుమరుగయ్యాయని పలువురు మహిళా రైతులు అన్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'చిరుధాన్యాలతో ఆహార సార్వభౌమత్యం'పై నిర్వహించిన సమావేశానికి సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్, యాదాద్రి జిల్లాల నుంచి మహిళా రైతులు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం వాతావరణ మార్పులకు అనుగుణంగా కొత్త విత్తనాలు ఉత్పత్తి చేసి రైతులకు అందించాలన్నారు. మార్కెట్‌లో చిరుధాన్యాలకు ధర ఉన్నా సరైన దిగుబడి లేదని చెప్పారు. చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. భూసార పరీక్షలు ప్రతి ఏడాది చేయాలన్నారు. తెల్ల కుసుమ సాగును పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న పిల్లలకు చిరుధాన్యాలతో ఆహారం అందించాలని కోరారు. పత్తి, వరి సాగును తగ్గించాలని, రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో పలురకల చిరుధాన్యాల పంటలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో డీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణీరావు, ప్రముఖ జర్నలిస్టులు కె.సజేయ, రమేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నిమ్మయ్య, అమరేంద్ర, జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి పాల్గొన్నారు.

**చిరుధాన్యాల సాగుపై మహిళా రైతుల తీర్మానాలు**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారసత్వ పంటలైన చిరుధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేయాలి. ప్రజా పంపిణీలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. జొన్న, సజ్జ, రాగి, అరికెలు, కొర్ర, కొడిసమ, వరిగి మొదలైన చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పించాలి.
- అంతరపంటగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి. అవి పండించే రైతులకు రైతు బంధులో రూ.10 వేలు ఆర్థిక సహకారం బోనస్‌గా ఇవ్వాలి. చిరుధాన్యాల కొనుగోలుకు గ్రామాల్లో కమిటీ వేసి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలను అందించాలి.
- కొనుగోలు చేసిన చిరుధాన్యాలను ఐసీడీఎస్ పథకం ద్వారా అంగన్‌వాడీలు, పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు భోజనం రూపంలో అందించాలి.
- పంటల బీమా పథకంలో చిరుధాన్యాలను చేర్చాలి. వాతావరణ మార్పులతో నష్టపోతోనే పరిహారం అందించాలి. వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి.
- పంటల దిగుబడి పెంచేందుకు కొత్తరకం విత్తనాలు ఉత్పత్తి చేయాలి. స్థానికంగా ఎన్నో తరాలుగా మహిళా రైతులు కాపాడుతున్న విత్తన రకాలను చెరిపే ప్రయత్నం చేయవద్దు. జీవవైవిధ్య పంటలను కాపాడాలి. విత్తన బ్యాంకులు ఏర్పాటు చేయాలి.
- వాతావరణ మార్పులకు తట్టుకోనే విత్తనాలు ఉత్పత్తి చేయాలి. పశు సంపదను పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలి. వలస పక్షులు, అడవి జంతువుల నుంచి పంటలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

## వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

పెద్దశంకరంపేట, డిసెంబర్ 22: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పెద్దశంకరంపేట మండలంలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. పేటలోని గోదాసహిత వేంకటేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, రామాలయం, కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సూర్యుడు ఉత్తరాయనికి మారేముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి, లేదా ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు. వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా తెల్లవారుజామున భగవంతుడిని దర్శించుకుంటే పుణ్యం వస్తుందని భక్తుల విశ్వాసం.



పెద్దశంకరంపేటలోని వెంకటేశ్వర ఆలయం



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## అందరి ఆశీస్సులతోనే గెలిచా

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

పటాన్‌చెరు, డిసెంబర్ 22: అందరి ఆశీస్సులతో మళ్లీ గెలిచానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో నియోజకవర్గ స్థాయి కృతజ్ఞత సభకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో తనపై నమ్మకంతో ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయం కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయాభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. తన హ్యాట్రిక్ విజయం మరింత బాధ్యతను పెంచిందన్నారు. సీఎంగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు తన విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బాధ్యతతో పని చేస్తానన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారి గురించి తనకు తెలుసన్నారు. ప్రతి మూడు నెలలకు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను రెపరెపలాడిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు రంగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు సఫానదేవ్, శంకర్‌యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, దేవానందం, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డి, పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేశ్‌యాదవ్, వైస్ చైర్మన్ రాములుగౌడ్ పాల్గొన్నారు.



కృతజ్ఞత సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 22: పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలని సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, పరిష్కారం, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. 2024 జనవరి 6న ముసాయిదా విడుదల చేసి, 22 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఫిబ్రవరి 8న తుది జాబితాను వెలువరించాలన్నారు. 1500కు మించి ఓటర్లు ఉన్నచోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆయా పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ప్రతివారం సమావేశం నిర్వహించాలని సూచించారు.

**ప్రభుత్వ భూముల వివరాలివ్వాలి**

జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను అందించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో క్రిస్మస్ వేడుకల నిర్వహణ, గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీని త్వరగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహాలక్ష్మి చేయూత(రాజీవ్ ఆరోగ్యశ్రీ) పథకాల అమలు తీరును పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ డీఎంలతో సమీక్షించాలని, అన్ని దవాఖానలను సందర్శించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో నగేశ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శరత్